పంచాయతీలకు కార్యదర్శులు కావాలి



పాలకోడేరు మండలం మోగల్లు గ్రామ పంచాయతీ భవనం



మోగల్లు ప్రధాన రహదారి పక్కనే చెత్తను డంప్ చేసిన దృశ్యం

- వేధిస్తున్న కొరత–నత్తనడకన అభివృద్ధి
- పలు పంచాయతీలకు ఇన్‌చార్జిలే దిక్కు
- పారిశుద్ధ్య నిర్వహణ మందగమనం

పాలకోడేరు: నియోజకవర్గంలో పంచాయతీలకు కార్యదర్శుల కొరత వేధిస్తుంది. దీంతో పాలన స్తంభించి, గ్రామాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి మూడు పంచాయతీలు అప్పగించడంతో గ్రామ పాలన దాదాపు స్తంభించిపోయింది. రక్షిత మంచినీటి పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్ల నిర్వహణ, జనన, మరణ రిజిస్టర్ల నిర్వహణ, పన్నుల విధింపు, వసూళ్లతోపాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శుల కోసం మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లవలసి వస్తుంది. వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళ్లినా కార్యదర్శులు అందుబాటులో లేక ప్రజలు నిరాశగా వెను తిరుగుతున్నారు. ఇన్‌చార్జి కార్యదర్శులు ఎక్కడ ఉంటారో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

కార్యదర్శుల నియామకం చేపట్టాలి

కొత్త ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది. అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థవంతమైన అధికారులు ఉండాలి. గ్రామ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. అధికారులు లేని గ్రామాలకు అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యదర్శులకు పొరుగు సేవలు

ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు మండలంలో 14 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం కేవలం 3 గ్రామాలకు మాత్రమే కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. విస్సాకోడేరు కార్యదర్శి బి.జార్జి ప్రసాద్ మోగల్లు, పాలకోడేరు, కుముదవల్లి గ్రామాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పెన్నాడ అగ్రహారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మి గొల్లలకోడేరు, గరగపర్రు, గొరగనమూడి గ్రామాలకు ఇన్‌చార్జిగా బాధ్యత నిర్వహిస్తున్నారు. కాళ్ల మండలం బొండాడ పంచాయతీ కార్యదర్శి దొంగ సత్యనారాయణ వేంప్ర, వేంప్ర అగ్రహారం, కొండేపూడి గ్రామాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కోరుకొల్లు పంచాయతీ కార్యదర్శి శ్యాం కుమార్ మైప గ్రామానికి ఇన్‌చార్జిగా బాధ్యత వహిస్తున్నారు. ఉండి మండలంలో 19 పంచాయతీలకు ఏడుగురు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. మిగతా గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులు బాధ్యత నిర్వహిస్తున్నారు. ఆకివీడు మండలంలో 16 పంచాయతీలకు నలుగురు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. మిగతా గ్రామాలు ఇన్‌చార్జి పాలనలో ఉన్నాయి. కాళ్ల మండలంలో 21 పంచాయతీలు ఉండగా 18 మంది కార్యదర్శులు ఉన్నారు. మిగతా మూడు గ్రామాలు ఇన్‌చార్జిల పాలనలో ఉన్నాయి.

కార్యదర్శి లేక అవస్థలు



మోగల్లు గ్రామానికి పూర్తి స్థాయి కార్యదర్శి అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీకి సంబంధించిన పనుల్లో జాప్యం ఏర్పడుతుంది. వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాలి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పూర్తిస్థాయిలో కార్యదర్శిని నియమించాలి.

– ఎం.శ్యామ్ కుమార్, మోగల్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పంచాయతీ కార్యదర్శుల కొరత విషయాన్ని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. కార్యదర్శులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలు పడే ఇబ్బందులను వివరించాం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్యదర్శులతోనూ, గ్రేడ్ 5 సిబ్బందితోనూ ప్రజలకు సేవలందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– టి.అనూహ్య, ఎంపీడీవో పాలకోడేరు

క్లుప్తంగా

పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు



విద్యార్థులకు అవార్డులు అందజేసిన దృశ్యం

కాళ్ల: విద్యార్థులు నిత్య పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు సాధించొచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్.రాజు తెలిపారు. మండలంలోని పెదఅమిరంలో ఎంజీఎం ట్రస్ట్ వద్ద మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల విద్యార్థులకు స్ఫూర్తి ప్రతిభ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బీవీ రాజు కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాంబాబు, రవి కుమార్, సర్వోదయ మండలి సభ్యులు కేవీఆర్ మురళీకృష్ణ, ఇందుకూరి ప్రసాద్ రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బేడ, బుడగలను ఎస్సీలుగా గుర్తించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: బేడ, బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించి వారికి కుల ధృవీకరణ పత్రాలు అందజేయాలని సీపీఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో బేడ, బుడగ జంగాల నాయకులు స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ తీవ్రంగా వెనుకబాటుకు గురైన బేడ, బుడగ జంగాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సనపల శ్రీనివాస్, కొమరాని శ్రీను, సంఘ అధ్యక్షుడు వీరన్నపల్లి పెద్దులు, నెల్లగంటి చెంచు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలతో ఎంఓయూ



కళాశాలతో ఎంఓయూ చేసుకుంటున్న శ్రీవిజయ దయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత మురళీకృష్ణ

వీరవాసరం: ఎస్ఎంబీటీ ఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, పాలకొల్లులోని శ్రీ విజయ దయాగ్నోస్టిక్ సెంటర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం(ఎంఓయూ)లో భాగంగా మంగళవారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు ఉపాధి నైపుణ్యాలలో ప్రావీణ్యం సాధించి, ప్లేస్‌మెంట్స్ పొందడానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు అన్నారు. కార్యక్రమంలో శ్రీ విజయ దయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

30 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



తణుకులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 30 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో హాజరైన వృద్ధులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేయగా ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేదలకు మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సభ్యులు కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: మండలంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం జరుగుతున్న ఉచిత ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎఈవో ఎం.శ్రీనివాస్ కోరారు. పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు డాక్టర్ అల్లు మహేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతీ మంగళవారం అందిస్తున్న సేవలపై ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్‌బీని ఆరా తీశారు. ప్రతీ మంగళవారం భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యతో పాటు, మాటలు రాని వారికి మాటలు నేర్పించడం, కాళ్లు, చేతులు పనిచేయని వారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



డెంగీ నివారణ మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి.బెన్నీ సామ్యూల్ అన్నారు. మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ సామ్యూల్ మాట్లాడుతూ డెంగీ దోమల ద్వారా వస్తుందన్నారు. మన పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనుకూలత లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రతీ శుక్రవారం డ్రై డేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయాలని ఇప్పటికే పీహెచ్‌సీ పరిధిలో దోమల నివారణ మందులు సరఫరా చేశామన్నారు. అలాగే పీహెచ్‌సీ సిబ్బంది జ్వరాల సర్వే తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

భీమవరం: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ భీమవరం లో ఫెడరల్ బ్యాంకు ఉద్యోగులు బ్యాంకు వద్ద మంగళవారం ఆదోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీ పాలసీ, పాత లేబర్ చట్టాలు అమలు చేయాలని, ఖాతాదారులపై ఇన్స్యూరెన్స్ భారం మోపొద్దని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ నాయకులు పి.నాగేశ్వరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, పి.భవితదుర్గ, విశ్వేశ్వరావు, వై.ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లాభసాటిగా పాడి పరిశ్రమ



రైతులకు యాంటీ బయోటిక్ పొడర్‌ను అందజేస్తున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి, తదితరులు

ఆకివీడు: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితేనే రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎంపీపీ కఠారి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు చెప్పారు. మండలంలోని పెదకాపవరంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూగ జీవుల వేదనను రైతులు గుర్తించి సకాలంలో వైద్యం చేయించాలన్నారు. అధిక పాల దిగుబడి, సూడి కట్టడం వంటి వాటి ద్వారా రైతు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాడని చెప్పారు. పశు సంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు సంబంధించిన గర్భ కోశ వ్యాధుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆవులకు వచ్చే లింపీ వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్‌లు వేయించాలని సూచించారు. పశు గణాభివృద్ధి కార్య నిర్వాహణాధికారి జేసురత్నం మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 90 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 23 పశువులకు అనారోగ్య చికిత్స, 30 లేగ దూడలకు నట్టల నివారణ మందు, 150 పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాలు, కోళ్లకు, గొర్రెలకు వ్యాధులు సంక్రమించకుండా యాంటీబయోటిక్ పొడర్ అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీసత్య, వర ప్రసాద్, హేమ, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్ డేకు అంగన్‌వాడీల మద్దతు



ప్రాజెక్టు అధికారిణికి వినతి పత్రం అందజేస్తున్న సంఘు నాయకులు

ఆకివీడు: దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న డిమాండ్స్ డేకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మద్దతు తెలిపిందని జిల్లా కార్యదర్శి ఎండీ హసీనా చెప్పారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అంగన్‌వాడీ వర్కర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు దూకుడుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీడీపీవో విజయ రత్నానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మార్తమ్మ, పైడేశ్వరి, దుర్గాదేవి, కృష్ణవేణి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ మండల అధ్యక్షులు పెంకి అప్పారావు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రంగమ నాయుడు

పాలకోడేరు: గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక వైద్యాధికారి సీహెచ్ రంగమ నాయుడు అన్నారు. ప్రతీ నెల 9న నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 70 మంది గర్భిణులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు విధిగా అంన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేయించుకొని, ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌వో సత్యనారాయణ, హెల్త్ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. తణుకు డిపో నుంచి ప్రయాణించే ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, స్లీపర్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు తమ విలువైన సూచనలు, ఫిర్యాదులను 99592 25484 నంబరులో తెలపాల్సిందిగా కోరారు. ప్రయాణికులు తెలిపిన సూచనలు, ఫిర్యాదులను పరిష్కరించి మరింత మెరుగైన సేవలను అందజేస్తామని వివరించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ డిపో కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. డిపో ఆధ్వర్యంలో అందజేస్తున్న బస్సు సర్వీసులు, కార్గో, యాత్ర ప్రత్యేక బస్సులు, బస్సు పాస్‌లు ఇతర సర్వీస్‌లపై విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25488 నంబరులో తెలిపాల్సిందిగా కోరారు.

నేడు ఆల్ ఇండియా డిమాండ్స్ డే

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ ప్రభుత్వంనకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు, ఉద్యోగులు ఈ నెల 10వ తేదీ బుధవారం ఆల్ ఇండియా డిమాండ్స్ డే ను నిర్వహిస్తున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డిలు వెల్లడించారు. మంగళవారం బాబూరావు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, కార్మిక రైతాంగానికి వ్యతిరేకంగా దాడులు సాగిస్తున్నారని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: ఆటో కార్మికులు తమ సమస్యలు పరిష్కారానికి సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. మంగళవారం తణుకు కొండాలమ్మ గుడి వద్ద నిర్వహించిన యూనియన్ సమావేశంలో భీమారావు, తణుకు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులపై అధికారుల వేధింపులు విడనాడాలని వారి సంక్షేమానికి ప్రభుత్వాలు సహకరించాలన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కొంగరాపు బాలకృష్ణ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న దాత సురేష్

కాళ్ల: ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల ఏర్పాటుకు దాతల సహకారం అభినందనీయమని వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు కాళ్లకురు గ్రామానికి చెందిన వీరమల్లు సురేష్ ముందుకు వచ్చారు. ఆసుపత్రిలో అవసరమయ్యే రెండు బెడ్స్, ఆరు ఫ్యాన్లు, రెండు బెంచీలను సుమారు రూ.40 వేలతో సమకూర్చారు. వీటిని వైద్యులు సరాబు సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. అదే విధంగా ప్రతీ నెల 9న నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో 54 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు దాత వీరమల్లు సురేష్ దాతృత్వంతో భోజనాలు ఏర్పాటు చేసి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యధికారి డాక్టర్ సరాబు సునీల్, సిబ్బంది దాత వీరమల్లు సురేష్‌ని సత్కరించి, మెమెంటో అందజేశారు. దాత సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

భీమవరం: పద్మశాలి ఎంప్లాయిస్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం భీమవరంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కట్టా లక్ష్మణస్వామి, దివి కుమారస్వామి, కోశాధికారిగా ఆకురాతి సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తుమ్మ బాలకృష్ణ, గుల్లంగి సాయి ప్రసాద్, చింతలపూడి వెంకట సుబ్బారావు, తమ్మిశెట్టి సత్యనారాయణ, ఎం.వెంకట ప్రసాద్, హనుమంతరావు సహాయ కార్యదర్శులుగా బందారు వెంకట కృష్ణ, కొక్కిరాల బాలాజీ సుబ్రహ్మణ్యం, తుమ్మ వీర వెంకట కృష్ణమూర్తి, ఆకురాతి కృష్ణమోహన్, ఉయ్యూరి శ్రీరాములు, గిడుతూరి వెంకట శివకుమార్ కార్యవర్గ సభ్యులుగా కాదూరి నాగరాజు, దార్న కనకదుర్గ, బత్తుల బుదజ్జమణి, గిడుతూరి మధులత ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆకురాతి పుష్పావతి, బీజేవీడీ రాజ్యలక్ష్మి, కోశాధికారిగా నేమాల బాలకృష్ణవేణి, రాష్ట్ర ప్రతినిధులుగా కానూరు నర్సమాంబ, డాక్టర్ వి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ, నీలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జేఏఐతోనే టెక్నాలజీకి భవిష్యత్



కళాశాల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఉమాదేసు

భీమవరం: టెక్నాలజీ భవిష్యత్ జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(జేఏఐ)పైనే ఆధార పడుతుందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు ఉమాదేసు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాంప్ట్ ఇంజనీరింగ్' అనే అంశంపై మూడు రోజులు నిర్వహించే వర్క్ షాప్ మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్ని టెక్నాలజీలు వచ్చినా భవిష్యత్తులో జేఏఐలో నైపుణ్యం పొందిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. గతంలో కోడింగ్ వంటి టెక్నాలజీలు కేవలం ఇంగ్లీష్ భాషకే పరిమితమయ్యేవని నూతన టెక్నాలజీ ఏ భాషలోనైనా సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ నూతన టెక్నాలజీని అందుకోవాలంటే నిరంతరం వర్క్‌షాప్‌లు, సెమినార్లతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎస్‌ఈ హెడ్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వానా కాలం.. వ్యాధుల గాలం

- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
- రోగులతో కిటకిటలాడుతున్న పీహెచ్‌సీలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ఎ.అరుణరాణి (ఫైల్)

భీమవరం అర్బన్: ఎండల నుంచి వాతావరణం మారి, సుమారు 10 రోజుల నుంచి వర్షాలు కురవడంతో దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, వైరల్ జ్వరాలతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్న వారు అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. దీంతో పీహెచ్‌సీలలో ఔట్ పేషెంట్స్ సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. సాధారణంగా ఎండల నుంచి వర్షాలకు వాతావరణం మారినప్పుడు ఇలాంటి వ్యాధులు మామూలుగానే వస్తాయి. అయితే ఈ ఏడాది ఎక్కువగా కనిపిస్తున్నాయి. భీమవరం మండలంలో 25 గ్రామ పంచాయతీలకు తుందుర్రు, గొల్లవానితిప్పలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వర్షాలు కాలం కావడం, రక్షిత మంచినీటి చెరువులలో కొత్త నీటిని నింపి సరఫరా చేయడం వలన దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, వైరల్ జ్వరాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతీ రోజు 70 నుంచి 80 మంది వరకు క్యూ కడుతున్నారు. ఇటీవల గుంటూరు జిల్లాలోని జగ్గయ్యపేటలో డయోరియాతో ఆరుగురు మరణించడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు మండలంలో డయోరియాపై అవగాహన మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో పొంచి ఉన్న ప్రమాదం

ఇటీవల వర్షాలు పడుతుండటంతో గ్రామాలలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యింది. బ్లీచింగ్ చల్లించకపోవడం, ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి. దీంతో గ్రామాల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇళ్ల చుట్టూ మురుగు గుంతలు, డ్రెయినేజీ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. దోమలు రాకుండా ఇళ్ల కిటికీలు, మెయిన్ డోర్‌లకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి. జ్వరం వచ్చి రెండు రోజుల్లో తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– ఎ.అరుణరాణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, గొల్లవానితిప్ప

అప్రమత్తతే శ్రీరామ రక్ష

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటమే శ్రీరామ రక్షని వైద్యులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత మేరకు వేడి పదార్థాలను భుజించాలి. రోడ్డు పక్కన విక్రయించే తినుబండారాలకు దూరంగా ఉండాలి. తాజా కూరగాయలను వండుకోవాలి.